ప్రజాశక్తి
సోమవారం 10 మార్చి 2025 5 విజయనగరం

గ్రీష్మకు ఎమ్మెల్సీ సీటు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాజాంకు చెందిన టిడిపి మహిళా నేత కావలి గ్రీష్మ కు ఎమ్మెల్సీ సీటు వరించింది. ఈ మేరకు ఎమ్మెల్యే కోటాలో టిడిపి ఆమెకు సీటు కేటాయిస్తున్నట్లు స్పష్టం చేసింది. గ్రీష్మ గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు ఆశించారు. సీటు రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందినప్పటికీ, అధిష్టానం ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ విజయానికి కృషి చేశారు. అధిష్టానం ఆదేశాలకు విధేయురాలుగా పనిచేయడంతో పార్టీ గుర్తించింది. ఈ నేపథ్యంలోని ఆమెకు ఎమ్మెల్సీ అవకాశం వచ్చిందని ఆమె సన్నిహితులు, అభిమానులు చెబుతున్నారు. గ్రీష్మ శాసనసభ మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి కుమార్తె. తాజా పరిణామాలతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎమ్మెల్సీ ఇద్దరూ ఇద్దరే అన్నట్టుగా చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ పదవి వస్తుందని ఆశించిన పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణకు నిరాశే ఎదురైంది.

- 150 గజాలలోపు గల ఇళ్లకు ఉచిత రిజిస్ట్రేషన్
- ఆ పైన 451 గజాల వరకు 50శాతం లేదా సాధారణ ఛార్జీలు
- అమల్లో పారదర్శకత ఏ మేరకు ఉంటుందో వేచి చూడాల్సిందే

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇళ్ల స్థలాల క్రమ బద్ధీకరణకు మార్గదర్శకాలు వెలువడ్డాయి. ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో జీవో నెంబర్ 30 విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఇటీవల ఒక ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం 150గజాలలోపు గల ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నారు. ఆపైన 451గజాల వరకు 50శాతం లేదా సాధారణ ఛార్జీలు విధిస్తారట. ఇందులో పేదల సంగతి కాస్త పక్కనబెడితే... పెద్దల విషయంలో ఏమేరకు పారదర్శకత ఉంటుందో వేచిచూడాల్సిందే.

ప్రభుత్వ స్థలాల్లో 2019 అక్టోబర్ 15లోపు ఉన్న ఇళ్ల క్రమ బద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందులో అభ్యంతరంలేని ప్రభుత్వ స్థలంలో ఆర్‌సిసి లేదా ఇంటి పైకప్పుతో కూడి ఇటుకల గోడల నిర్మాణాలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. లబ్ధిదారుని కుటుంబం లేదా ఆ కుటుంబంలోని సభ్యుడి పేరు రాష్ట్రంలో మరెక్కడా సొంత ఇళ్లు లేకపోతేనే ఇది వర్తిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం స్కీముల ద్వారా ఇంతకు ముందు లబ్ధి పొంది ఉంటే తాజాగా కట్టిన ఇళ్లు రెగ్యులర్ చేసే అవకాశం ఉండదు. ఒకవేళ అన్ని అర్హతలూ ఉంటే, సంబంధిత కుటుంబంలోని మహిళ పేరున మాత్రమే రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం అనుమతిస్తుంది. వీటన్నింటికన్నా ముఖ్యంగా దారిద్ర రేఖకు దిగువనున్న కుటుంబాలకు మాత్రమే క్రమ బద్ధీకరణ అమలుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీని ప్రకారం ఏడాదికి వార్షిక ఆదాయం రూ.1.20లక్షలకు మించరాదు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు, పిఎస్‌యు, కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగులకు అవకాశం లేదు. పది ఎకరాలకు మించని వ్యవసాయ భూమి లేదా తడి భూమి లేదా తడి, పొడి కలిపి 10ఎకరాలకు మించితే ఈ పథకం వర్తించే పరిస్థితి లేనట్టే. ఆదాయపన్ను చెల్లిస్తున్నవారు, నాలుగు చక్రాలవాహనదారులు, వ్యవసాయ కోసం ఉపయోగించే ట్రాక్టర్లు, ట్రక్కులు ఉన్నవారికి కూడా మినహాయింపు ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో గరిష్ట ఆదాయం రూ.1.44లక్షలకు మించరాదు. కుటుంబానికి ఒక్కసారి మాత్రమే ఈ ఇళ్ల క్రబద్ధీకర వర్తించే విధంగా రూపకల్పన చేశారు. ఈ నిబంధన ప్రకారం గతంలో ప్రభుత్వ స్థలం ఇంటిని నిర్మించున్నవారికి లేదా ఇప్పటికే ఆ ఇళ్లు విక్రయించినా ఈసారి లబ్ధి పొందేందుకు అవకాశం లేదు.

ఇళ్ల క్రబద్ధీకరణకు స్థల విస్తీర్ణాన్ని బట్టి ప్రభుత్వం కేటాయింపు ధర నిర్ణయించింది. ఇంటి విస్తీర్ణం, దిగు పేద, ఎగువ పేద అనే తీరున విభజించి చెల్లించాల్సిన ఛార్జీలను కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఈలెక్కన 150 గజాల వరకు ఉచితంగా ప్రభుత్వమే దఖలు పరుస్తుంది. పట్టా జారీచేసిన రెండేళ్ల తరువాత డి-పట్టాతోపాటు కన్వేయర్ డీడ్ ఉచితంగా అందజేయనున్నారు. 151గజాల నుంచి 300 గజాల్లో ఉన్న ఇళ్లకు సంబంధ స్థలానికి ప్రాథమిక విలువ కట్టి, దాన్నిబట్టి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారైతే రిజిస్ట్రేషన్ ఫీజులో 50శాతం, దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారైతే సాధారణ ఫీజు చెల్లించాలి. 301 నుంచి 450 విస్తీర్ణంలోవున్న ఇళ్లకు కూడా పైన పేర్కొన్నట్లు ప్రాథమిక భూమి ఆధార విలువ ఆధారంగా 50శాతం లేదా సాధారణ ఫీజు చెల్లించాల్సివుంటుంది. 541గజాలకు పైగా ఉన్న ఇళ్లకు ఎపిఎల్, బిపిఎల్ అనేదానితో సంబంధం లేకుండా ప్రథమిక భూమి విలువలో 5రెట్లు విలువపై సాధారణ రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సివుంటుంది. అర్హులైనవారు వార్డు లేదా గ్రామ సచివాయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వీటిని సంబంధిత విఆర్‌ఒ క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం సంబంధిత తహసీల్దార్లకు నివేదిస్తారు. అక్కడి నుంచి అప్రూవల్ కమిటీకి చేరుతాయి. ఆర్‌డిఒ లేదా సబ్- కలెక్టర్ చైర్మన్‌గాను, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, తహశీల్దార్ సభ్యులుగా ఉండే ఈ కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయనుంది.

యూనియన్ జిల్లా అధ్యక్షులు పైడిరాజును గృహ నిర్బంధం చేసిన పోలీసులు

కొత్తవలసలో కార్యకర్త తులసిని నిర్బంధించిన పోలీసులు

అంగన్వాడీల గృహ నిర్బంధం

చలో విజయవాడ భగ్నానికి ప్రభుత్వ యత్నం

ఖండించిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్/కొత్తవలస

రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టిన నేపథ్యంలో ఆదివారం విజయనగరం జిల్లాలో పలుచోట్ల అంగన్‌వాడీ యూనియన్ నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. విజయనగరం జిల్లాలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజును విజయనగరంలోను, జిల్లా కమిటీ సభ్యులు కె.తులసిని కొత్తవలసలోను తమ నివాసాల వద్ద పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. నాయకుల అరెస్టులను సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్ ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేయడానికి విజయవాడ అలంకార సెంటర్ వద్ద ప్రభుత్వం పరిమిషన్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ జిల్లాలో అంగన్వాడీ వర్కర్సను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు మానుకొని వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుమడ రైల్వేస్టేషన్ వద్ద ఏడుగురు అంగన్‌వాడీ కార్యకర్తలను, సిఐటియు నాయకుడు కె.సాంబమూర్తిని పోలీసులు అడ్డుకున్నారు. నిడగల్లులో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతిలక్ష్మిని, మక్కువలో అంగన్‌వాడీ మండల నాయకులు దాలమ్మను గృహ నిర్బంధం చేశారు.

రాత్రి 11గంటల తరువాత సంచరిస్తే చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సహేతుకమైన కారణం లేకుండా అర్ధరాత్రి పట్టణాల్లో తిరిగితే టౌన్ న్యూసెన్సు చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా జనవరి నుండి ఇప్పటి వరకు 850 మందిపై టౌన్ న్యూసెన్సు చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, కౌన్సిలింగు నిర్వహించినట్లు తెలిపారు. పెట్రోలింగు నిర్వహించే సమయాల్లో పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని, అందుకు అనుగుణంగా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. విజయనగరంలో రైల్వేస్టేషను, ఆర్టీసి కాంప్లెక్స్, మూడు లాంతర్లు, కోట

జంక్షన్, బాలాజీ జంక్షన్, దాసన్నపేట, రైతు బజార్, రింగు రోడ్డు, కొత్తపేట, ఐస్ ఫ్యాక్టరీ, జమ్ము, విటి అగ్రహారం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాల్టీల్లో కొన్ని ముఖ్య ప్రాంతాల్లోను పోలీసులు తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకొంటూ, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, సహేతుకరమైన కారణాలు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించిన వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలిస్తున్నామని తెలిపారు. వారిని పోలీసు స్టేషనుకు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సిలింగు నిర్వహిస్తున్నామని అన్నారు.

ముగ్గురు సచివాలయ కార్యదర్శులు సస్పెన్షన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల వసూలు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన ముగ్గురు భాగంగా ముగ్గురు సచివాలయ పరిపాలన కార్యదర్శులను కమిషనర్ నల్లనయ్య సస్పెండ్ చేశారు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల మొత్తాలను గరపాలక సంస్థకు సకాలంలో జమ చేయలేదనే విషయమై సమగ్ర విచారణ జరిపించి, ఆ మొత్తాలను తిరిగి నగరపాలక సంస్థకు చలానా రూపంలో కట్టించుకున్న అనంతరం, వారిని విధుల నుండి సస్పెండ్ చేశారు. ఈ ముగ్గురు పరిపాలన కార్యదర్శులు వారు వసూలు చేసిన పన్ను మొత్తాలను నగరపాలక సంస్థ ఖజానాలో జమ చేయలేదన్నారు. 49వ డివిజన్ గాజులరేగ-3, సచివాలయం నెంబర్ 59కు చెందిన పరిపాలన కార్యదర్శిగా ఉన్న ఏనుగుతల ప్రవీణ్ కుమార్ తాను వసూలు చేసిన రు.26,38,238ను నగర పాలక సంస్థకు జమ చేయలేదన్నారు. గాజులరేగ-2 సచివాలయం నెంబరు 58 అడ్మిన్ కార్యదర్శిగా ఉన్న పొట్నూరు మాధురి, గాజులరేగ-1 కు చెందిన 57వ సచివాలయ పరిపాలన కార్యదర్శి కె.సూర్యనారాయణ, 41 డివిజన్ పరిపాలన కార్యదర్శిగా ఉన్న డి.రామకృష్ణ వసూలు చేసిన పన్నుల మొత్తాలను నగర పాలక సంస్థకు జమ చేయలేదని నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

పన్నుల వసూలును పరిశీలించిన ఎసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పన్ను వసూళ్లతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన పి4 సర్వే, వర్క్‌ఫ్రం హోం సర్వేలను అసిస్టెంట్ కమిషనర్ కె.అప్పలరాజు ఆదివారం పరిశీలించారు. సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న సర్వేలు పన్ను వసూళ్ల ప్రక్రియలను వేగవతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పన్ను వసూళ్లలో ఏర్పడుతున్న క్షేత్రస్థాయి సమస్యలను ఆయన అక్కడికక్కడే పరిష్కరించారు. అందరి సమిష్టి కృషితో సర్వేలను, పన్ను వసూలను శతశాతం పూర్తి చేయాలని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి విడుదలకు

12న యువత పోరు

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇస్తామన్నా నిరుద్యోగ భృతి నిధులు విడుదల చేయాలని కోరుతూ ఈనెల 12 న యువత పోరు పేరుతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.4400 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని తెలిపారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తే దానిని ప్రైవేటుపరం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచించడం అన్యాయమన్నారు. వెంటనే మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు కొత్త పెన్షనలు ఇవ్వకపోగా పాత పెన్షన్లు తొలగించే పని జరుగుతోందన్నారు. ఇచ్చిన హామీలు,ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ఈనేపథ్యంలో తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విద్యార్థులు, యువత జయప్రదం చేఆయలనికోరారు. అదేరోజు పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం యువత పోరు గోడ పత్రికను విడుదల చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు సూర్యనారాయణ రాజు, నెక్కలనాయుడు బాబు, జైహిందకుమార్, బంగారునాయుడు, నరసింహమూర్తి, యువజన ,విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

క్లస్టర్ విధానంపై స్పష్టత ఇవ్వాలి

ఒక సచివాలయానికి ఒక విఆర్ఒ ఉండాలి

ఎపి గ్రామ విఆర్‌ఒల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న రేషనలైజేషన్‌లో క్లస్టర్ విధానం వల్ల రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్ చేసి ఒక విఆర్‌ఒను నియమించడంతో ప్రస్తుతం రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు 7500 మంది కేడర్ స్ట్రెంత్ తగ్గిపోతుందని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అప్పలనాయుడు, వి.శ్రీనివాసరావు అన్నారు. ఒక సచివాలయానికి ఒక విఆర్‌ఒ ఉండేలా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో జరిగిన జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు.రేషనలైజేషన్‌తో మిగలిపోయిన 7500 మంది విఆర్‌ఒలను ఏం చేస్తారని ప్రశ్నించారు. అర్హులైన విఆర్‌ఎలకు ప్రమోషన్లు కల్పించి కేడర్ స్ట్రెంత్ తగ్గకుండా చూడాలని కోరారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్, జిపిఎస్‌పై వెంటనే శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

నేటి నుంచి పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి-విజయనగరంకోట/టౌన్

ఈనెల 10వ తేదీ సోమవారం నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమాన్ని పునః ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో గత కొన్ని వారాలుగా పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో సోమవారం నుంచి యధావిధిగా గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని అర్జీదారులు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్లోని ఆడిటోరియంలోను, జిల్లా పోలీసు కార్యాలయంలోను ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కూడా పిఆర్‌జిఎస్‌ను పునః ప్రారంభిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి యాక్షన్‌ప్లాన్

రూ.99.36 లక్షలతో ప్రతిపాదనలు • నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి సమీపిస్తుండటంతో నగరంలో నీటి ఎద్దడి తలె త్తకుండా నగరపాలక సంస్థ అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ (ప్రణాళికలు) రూపొందించారు. నగరంలో తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయమూ కలగకుండా ఉండేందుకు రూ. 99.36 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. వేసవి వస్తే నగరంలో నీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ఆంధ్ర, తోటపల్లి నుంచి చంపావతి నదికి నీటిని రెండు సార్లు తీసుకురావాల్సి వస్తుంది. చంపావతిలో నీటిమట్టాల స్థాయి ఏటా వేసవిలో పడిపోతున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టుల నుంచి తెప్పించిన నీటిని ఊటబావుల వద్దకు చేర్చి, నిల్వ చేసి వేసవిలో నగరానికి పంపింగ్ చేస్తారు. ప్రతి వేసవిలో నీటి సమస్య ఉత్పన్నం అవుతుండడంతో మోటార్లు, బోర్లు ఫ్లషింగ్, అదనపు ట్యాంకర్ల సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకునేవారు. ఏటా మార్చి, మే నెలల్లో ఆంధ్ర రిజర్వాయరు నుంచి నెల్లిమర్ల, రామతీర్థం, చంపావతి నదిలోని ఊటబావుల వద్దకు నీటి విడుదలకు చర్యలు తీసుకుంటారు. అదే విధంగా ఈ వేసవిలో కూడా నీటి ఎద్దడి నివారణకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా నగర పాలక సంస్థ అధికారులు నిధులు కేటాయించారు. లీకుల నివారణకు రూ.9.87 లక్షలు, ముషిడిపల్లి పథకం వద్ద ఊట బావుల నుంచి పూడికతీత పనులకు రూ.4.25 లక్షలు కేటాయించారు. రెండు అదనపు ట్యాంకర్ల కోసం రూ.15.69 లక్షలు ప్రతిపాదించారు. 50 డివిజన్లలో రూ.19.25 లక్షలతో అవసరం మేరకు చేతి బోర్లు వేయడానికి, ప్రస్తుతం ఉన్న బోర్ల ఫ్లషింగ్‌కు రూ.9.77 లక్షలు, ఇంటర్ కనెక్షన్లకు రూ.8.88 లక్షలు కేటాయించారు. బోర్ల మరమ్మతు సామగ్రికి కోసం రూ.9.75 లక్షలు ప్రతిపాదించారు. గత ఆగస్టులో రూ.18లక్షలతో కొనుగోలు చేసిన సామగ్రిని ప్రస్తుతం వినియోగిస్తున్నారు. ముషిడిపల్లి పథకం వద్ద రూ. 22 లక్షలతో సబ్ మెర్సిబుల్ మోటార్లు, ప్యానెల్

బోర్డులు, ఊటబావుల వద్ద సబ్‌మెర్సిబుల్ కేబుల్స్ ఏర్పాటుకు ఇప్పటికే టెండర్లు పిలిచినట్లు నగర పాలకసంస్థ అధికారులు తెలిపారు.

నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు

వేసవిలో నీటి సమస్య రానీయకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం . రూ.99.36 లక్షలతో వేసవి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. కౌన్సిల్ ఆమోదం తీసుకొని అమలు చేస్తాం. నీటి పథకాల వద్ద పర్యవేక్షణ చేస్తున్నాం. నీటికొరత ఉన్న ప్రాంతాలకు

పి.నల్లనయ్య, నగర పాలక సంస్థ కమిషనర్

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- 119 కేంద్రాల్లో పరీక్షలు
- మార్చి 17 నుంచి 31 వరకు నిర్వహణ
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- 'ప్రజాశక్తి'తో జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి 17 తేదీ నుంచి 31 వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు తెలిపారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పరీక్షలకు చేస్తున్న ఏర్పాట్లు, విద్యార్థుల సన్నద్ధం, పరీక్షలకు ఎలా సిద్ధం చేశారు అనే విషయాలపై ప్రజాశక్తికి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు.

» ఈ ఏడాది ఎన్ని పాఠశాలల నుంచి ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు?

జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలో ఉన్న 450 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 23,765 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు బాలురు 11501మంది, బాలికలు 11,429 మంది, ప్రైవేటు విద్యార్థులు బాలురు 553మంది, బాలికలు 282 మంది పరీక్షకు హాజరు కానున్నారనీ తెలిపారు.

» పరీక్షలు ఎప్పటి నుంచి. ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు? సౌకర్యాలు ఎలా ఉంది?

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 తేదీ నుంచి 31 వరకు జరుగుతాయి. జిల్లాలో 119 కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటలు వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. కేంద్రాల్లో వెలుతురు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నాం. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం.

» విద్యార్థులకు హాల్ టిక్కెట్ల పంపిణీ జరిగిందా?

పాఠశాలల్లో హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది కొత్తగా ప్రభుత్వం వాట్సప్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. పాఠశాలల్లో కూడా హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయి.



» మెరుగైన ఫలితాలు కోసం తీసుకున్న చర్యలు ఏమిటి?

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది కంటే ఉత్తీర్ణతశాతం పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. ఇప్పటికే అన్ని విద్యా సంస్థల్లో సిలబస్ పూర్తి చేయడంతో పాటు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాం. మెరుగైన ఫలితాలు కోసం ఉదయం, సాయంత్రం గంట అదనంగా తరగతులు నిర్వహించి, చదివిస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చిన స్టడీ మెటీరియల్ అందించింది. ప్రీ ఫైనల్ పరీక్షలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాం.

» పరీక్షల నిర్వహణకు ఎంత మంది సిబ్బందిని నియమించారు?

119 కేంద్రాల్లో జరగనున్న టెన్త్ పరీక్షల కోసం మొత్తం 1300 మంది సిబ్బందిని నియమించాం. వీరితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ లు, సిటింగ్ స్క్వాడ్లు, ఒక హైపవర్ కమిటీ నియమించాం. పరీక్షల విధులు నిర్వహించే ఉద్యోగులెవరూ సెల్ ఫోన్, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరా లు ఉపయోగించడానికి అనుమతి లేదు.

» పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి?

- పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు పలు శాఖల సహకారం తీసుకుంటున్నాం. ఆర్టీసి, విద్యుత్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ సహకారం తీసుకుంటున్నాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థులు సైతం ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు తీసుకొని వస్తే పరీక్షకు అనుమతించేది లేదు. కేవలం పెన్, అట్ట, హాల్ టికెట్ మాత్రమే విద్యార్థులు తెచ్చుకోవాలి.

» విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకునేందుకు రవాణా సదుపాయం కల్పించారా?

- పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేశాం. ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం విద్యార్థులు వారి గ్రామాల నుంచి సకాలంలో వచ్చే విధంగా బస్సులు తిరుగుతాయి. ఆర్‌టిసి అధికారులు ఆ విధంగా ఏర్పాటు చేశారు. బస్సులు తిరిగే ప్రాంతంలో బస్సులో హాల్ టికెట్స్ చూపించి ఉచితంగా పరీక్షలకు హాజరు కావచ్చు.

గ్రంథాలయ నిర్మాణానికి సహకరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రంథాలయ నూతన భవనం నిర్మాణానికి సహకరించాలని జరజాపుపేట నవోదయ గ్రంథాలయ కమిటీ సభ్యులు ఆదివారం శ్రీకాకుళం జిల్లా చిలకపాలేంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడును కలిసి కోరారు. జరజాపు పేటలో లైబ్రరీ 1962లో స్థాపించి నేటికీ శాశ్వత భవనం లేనందున నూతన భవనం నిర్మాణానికి ఎంపి నిధుల నుండి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం గ్రంథాలయ కమిటీ, గ్రామ పెద్దలు కలిసి ఆయనను సాదరంగా సత్కరించారు. నిధులు మంజూరుకు ఎమ్‌పి సానుకూలంగా స్పందించినట్లు కమిటి సభ్యులు తెలిపారు.

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణకు బంగారయ్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల

భారత ప్రభుత్వ హోంమంత్రిత్వ శాఖ నిర్వహించనున్న 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ (ఎన్ఐడిఎం) శిక్షణకు తంగుడుబిల్లి ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర విద్య డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు జిల్లా విద్యాశాఖ నుండి గణిత ఉపాధ్యాయులు శివుకు బంగారయ్యకు ఉత్తర్వులు అందాయి. కృష్ణా జిల్లా సౌత్ క్యాంపస్ కొండపవలూరు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్మెంట్, సౌత్ క్యాంపస్ కొండాపవలూరు కృష్ణాజిల్లాలో జరిగిన ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమానికి బంగారయ్యను పంపించారు. రాష్ట్రంలో ప్రతి జిల్లా నుండి ఇద్దరు టీచర్స్ చొప్పున ఈ శిక్షణకు ఎంపిక చేసి పంపించారు. ముఖ్యంగా చైల్డ్ సెంట్రిక్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ (బాల కేంద్రీకృత విపత్తు రిస్క్ తగ్గింపు)పై ఐదు రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఫ్లవర్స్ డెకరేటర్స్ అండ్ లైటింగ్, సౌండ్స్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ యూనియన్ అధ్యక్షుడు ఎన్నాబాబు అన్నారు. బొబ్బిలి పట్టణ సమీపంలో ఉన్న మహారాణి తోటలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లవర్ డెకరేటర్స్, లైటింగ్, సౌండ్స్ కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. కార్మికుల కోసం పోస్టల్ బీమా చేపిస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు అండగా ఉండేందుకు మన కుటుంబం సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భోజనాలను వడ్డిస్తున్న టిడిపి మండల అధ్యక్షులు ఆనంద్

సారిపల్లిలో మహా అన్నదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారిపల్లి భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామీ దేవాలయంలో ఆదివారం సప్తహా 49 రోజుల 24 గంటలు శివపంచ్చాక్షరీ మహా మంత్రాన్ని జపించి శివణామస్మరణతో భక్తులు మారు మోగించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మంచు కుమారస్వామీ, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనందకుమార్, జైత్ర కన్స్ట్రక్షన్స్ అధినేత ఆల్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 85 మంది ఎంపిక

ప్రజాశక్తి- రేగిడి

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మండల కేంద్రం లోని శ్రీ సత్యసాయి బాబా మందిరం వద్ద ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి రేగిడి భగవాన్ శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్యర్యంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆస్థాలమిక్ వైద్యులు సురేష్ 120 మంది కంటి రోగులను పరీక్షించి 85 మందికి కంటి ఆపరేషన్ అవసరమని ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కంటి నరాలు చికిత్స కోసం, కంటి పై పొర చికిత్స, కంటి నీటి కాసుల చికిత్స, కంటి రెప్పల చికిత్స, చిన్నపిల్లల కంటి చికిత్స కోసం ఆస్పత్రికి ఆపరేషన్ కోసం తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో భగవాన్ శ్రీ సత్యసాయి భజన మండలి నాయకులు మామిడి శివ ప్రసాద్, లావేటి విష్ణుమూర్తి, కన్వీనర్ తులసి నాయుడు, జే.శివ, ఐ.అన్నాజీ, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్ అశ్వని కుమార్, కె .ప్రసాద్, నర్సింగ్ స్టాఫ్ లావణ్య వైద్య సిబ్బంది పాల్గొని సేవలందించారు.

సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

విద్యతోనే ఉత్తమ పౌరులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని డిఇఒ యు.మాణిక్యంనాయుడు అన్నారు. స్థానిక గురజాడ పాఠశాల 27వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు విలువలతో అత్యుత్తమ విద్యను అందిస్తున్న గురజాడ స్కూల్ పూర్వ విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని రఘువర్మ మాజీ ఎమ్మెల్సీ అన్నారు. విద్యార్థి దశ నుండి విద్యార్థులు విద్యతోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని మంచి జీవన నైపుణ్యాలను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆద్యంతం తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి

క్యూలో నిలబడిన యాత్రికలు

ఘనంగా మారు జాతర

ప్రజాశక్తి-చీపురుపల్లి

కనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ నెల 2,3,4 తేదీలలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం జరిగిన విషయం తెలిసిందే. అయితే ఆనవాయితీ ప్రకారం జాతర జరిగిన మరుసటి ఆదివారం మారు జాతర జరపడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే ఆదివారం మారు జాతర ఉత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొనేందుకు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుండే భక్తులు బారులు తీరారు. ధర్శనానికి వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లుని ఆలయ ఇఒ బి శ్రీనివాసరావు, ఆలయ కమిటి చేసింది. భారీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - బొబ్బిలి

టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణ పేదల కోసం రామన్నదొరవలస సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయాన్ని ఆదివారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇళ్లు లేని పేదల కోసం గత టిడిపి హయాంలో టిడ్కో ఇళ్లను మంజూరు చేసిందని, అప్పటిలో నిర్మాణాలు పూర్తి చేయలేదని అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. లబ్ధిదారులతో డబ్బులు కట్టించుకుని బ్యాంకు రుణాలు తీసుకుని ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇల్లు అప్పగించకుండానే బ్యాంకర్లు లబ్ధిదారులకు లోన్ చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. 1680 ఇళ్లను నిర్మిస్తామని చెప్పిన పాలకులు నిర్మాణాలు పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో మౌలిక సదుపాయాలు పూర్తిగా లేవన్నారు. తక్షణమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మాట్లాడుతున్న గాడి అప్పారావు

కొత్తవలసలో ప్రజా చైతన్య యాత్ర

కొత్తవలస: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేసేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి

బొబ్బిలి: టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సిమెంట్ రోడ్డులో ఆయన పర్యటించారు. ఇంటిటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెరిగాయని చెప్పారు. పెంచిన ధరలకు వ్యతిరేకంగా అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి పరిష్కారమయ్యే విధంగా చొరవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణ, ఈశ్వరమ్మ, అప్పలరాజు, రమణమ్మ, లక్ష్మి, అనురాధ, ఉమా, పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రతినిధులు

ఘనంగా కిండర్ గార్టెన్స్ గ్రాడ్యుయేషన్

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ఓక్లాండ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శని, ఆదివారం రెండురోజులు పాటు కిండర్‌గార్టెన్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను పాఠశాల యాజమాన్యం అంద జేసింది. పాఠశాల కరస్పాండెంటు డాక్టర్ పాల్ శ్రీనివాన్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన ప్రిన్సిపాల్ రవితోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లల ఉన్నత భవిష్యత్తు కోసం చేసిన కృషిని ప్రశంసించారు. ప్రిన్సిపాల్ రవి, చైర్మన్ శివనారాయణ గ్రాడ్యుయేట్ విద్యార్థులను అభినందించారు.

మృత్యు కూపాలుగా గని బంటాలు

- అడ్డగోలుగా తవ్వకాలు
- నిబంధనలు గాలికి
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబిఎం) నిబంధనలు గాలికి వదిలేయడంతో చీపురుపల్లి ప్రాంతంలో పలుచోట్ల మైనింగ్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా తవ్వి వదిలేసిన మైనింగ్ గోతులు మృత్యు కూపాలుగా దర్శనమిస్తున్నాయి. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ నిబంధనల ప్రకారం మైనింగ్ ఖనిజాల తవ్వకాలు జరిపి వదిలేసిన గని బంటాలను సంబంధిత యాజమాన్యం బాధ్యత వహిస్తూ వాటికి పూర్తిస్థాయిలో రక్షణ కవచం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను సంబంధిత యాజమాన్యాలు గాలికి వదిలేయడంతో పాటు పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు సైతం చూసీ చూడనట్లు వదిలేయడంతో సామాన్యుల ప్రాణాలు గని బంటాలలో ఆవిరైపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ జరిగే ప్రాంతంలో చుట్టూ రక్షణ కవచాలు ఏర్పాటు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం ప్రత్యేక కాపలాదారులను కూడా నియమించాల్సి ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

పర్యవేక్షణ లోపం

గనుల శాఖకు సంబంధించిన అధికారులు కూడా ఐబిఎం నిబంధన అమలుపైన నిత్యం పర్యవేక్షణ జరపవలసి ఉన్నప్పటికీ కనీస పర్యవేక్షణ లేకపోవడంతో సంబంధిత యాజమాన్యాలు నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి. నిబంధనల ప్రకారం మైనింగ్ జరిగే ప్రాంతంలో ప్రత్యేక రక్షణ కమిటీని ఏర్పాటు చేసి కమిటీ సభ్యులతో నెలకొకసారైనా సమావేశాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ సమావేశాలు కేవలం రికార్డులకు పరిమితమవుతున్నాయంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసి రక్షణ అంశాలపైన తీసుకున్న చర్యలపైన చర్చలు జరపాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న వాదన వినిపిస్తుంది. నిబంధనలు మేరకు మైనింగ్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాల్సి ఉన్నా మామ్మూళ్ల మత్తులో పర్యవేక్షణ అటకెక్కిపోయినట్లు తెలిస్తోంది.

ప్రమాదకరంగా తవ్వి వదిలేసిన గని బంటా

అనధికారికంగానే..

చీపురుపల్లి మండలంలో నడిపల్లి, ఇటికర్లపల్లి, పేరిపి ప్రాంతాలతో పాటు గరివిడి మండలం కోడూరు, గడబవలస ప్రాంతాల్లో అధికారికంగాను, అనధికారికంగా కూడా మైనింగ్ తవ్వ కాలు చేపడుతుఆన్నరు. ప్రభుత్వ అనుమతులను కొద్దిగా తీసుకొని అంతకు మించి ఎక్కువ స్థాయిలో యథేచ్ఛగా మైనింగ్ తవ్వకాలు జరుపుతుండడంతో ఎక్కువ శాతం గని బంటాలు దర్శనమిస్తున్నాయి. సమీప ప్రాంతాల్లో గల గ్రామాల రైతులు పశువుల మేత కొరకు గని బంటాలు గల ప్రాంతాల్లో సంచరిస్తూ పలుచోట్ల మూగజీవాలతో పాటు రైతులు కూడా మృత్యువాత పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన కె.రాములు అనే వృద్ధుడు పేరిపి, ఇటకర్లపల్లి గ్రామాల మధ్య గల సర్వాగి మైనింగ్‌కు చెందిన గుంతలో పడి మృతి చెందడం ఈ ప్రాంత వాసులను మరింత ఆందోళనకు గురిచేస్తుంది. వర్షాలు పడే సమయంలో మైనింగ్ గోతులు అంచులు కొంచెం కొంచెంగా కరిగి జారిపోతుండటంతో ఆ ప్రాంతంలో సంచరించే మూగజీవాలు సైతం గనిబంటాలలో పడి మృతి చెందుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మైనింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేసిన గని బంటాల చుట్టూ రక్షణ కవచాలను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అడ్డగోలుగా తవ్వకాలు

మైనింగ్ యాజమాన్యాలు అడ్డగోలుగా తవ్వకాలు చేపడుతున్నాయి. అనుమతులు తక్కువుకు తీసుకుని వందలాది మీటర్ల లోతులో బంటాలను తవ్వి వదిలేస్తున్నాయి. మైనింగ్ ముడి సరుకు కోసం జరిపిన తవ్వకాలతో ఖనిజం దొరికిన తరువాత వందలాది మీటర్ల లోతులో తవ్వి వదిలేసిన గోతుల్లో పడి మూగ జీవాలతోపాటు సమీప గ్రామాల రైతులు ప్రాణాలను కోల్పోతున్నారు. తవ్వి వదిలేసిన గుంతల చుట్టూ కనీసం ప్రమాద నివారణ రక్షణ చర్య లేకపోవడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు.

ప్రయివేటు ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దుచేయాలి

ప్రజాశక్తి- వేపాడ

వాహన ఫిట్నెస్, రెన్యువల్, రిజిస్ట్రేషన్ సేవలను ప్రయివేటీకరిస్తూ వేదాంత ప్రయివేటు ఫిట్‌నెస్ సెంటర్‌ను గరివిడి మండలం అచ్చుతాపురంలో ఏర్పాటు చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్ అన్నారు. మండలంలోని బొద్దాం, సోంపురం, వేపాడ ఆటో కార్మికులతో ఆయన ఆదివారం సమావేశమై ఈ నెల 10న నిర్వహించనున్న కలెక్టరేట్ వద్ద ధర్నా గురించి ప్రచారం చేశారు. అనంతరం గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వేదాంతకి ఇచ్చిన ప్రయివేటు పిటినెస్ సెంటర్‌ను వెంటనే రద్దుచేసి ఆర్‌టిఒ అధికారులే సేవలందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లపై ఈ విధంగా ఆర్థిక దాడికి పాల్పడడం సరికాదన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు పద్మనాభం, రామారావు, శంకర్, వెంకటరావు, అప్పలకొండ, సత్తిబాబు, వెంకటసత్తి పాల్గొన్నారు.

గజపతినగరం: అచ్చుతాపురంలోని ప్రయివేటు ఫిట్నెస్ సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఆటో, క్యాబ్, లారీ, వ్యాన్ తదితర మోటార్ ట్రాన్స్‌ఫోర్ట్ డ్రైవర్లందరూ పాల్గొనాలని శ్రీ మజ్జి గౌరమ్మ, శ్రీ కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కోమటిపల్లి, మానాపురం స్టాండ్ నాయకులు సిహెచ్ అప్పలనాయుడు ఉమామహేశ్వరరావులు కోరారు. ఈ రెండు స్టాండ్‌ల వద్ద ఆదివారం సమస్యలతో కూడిన పోస్టర్‌ను విడుదల చేసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల రెన్యువల్, రిజిస్ట్రేషన్, ఫిట్నెస్, లైసెన్స్ వంటి సేవలను ప్రయివేటీకరిస్తే ప్రమాదాలు మరింత పెరుగుతాయన్నారు. తక్షణమే పెంచిన ఫీజులు పెనాల్టీల జిఒ 21 రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వేపాడ: నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు

ఆత్మ విశ్వాసంతో ఎయిడ్స్‌ని జయించొచ్చు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎయిడ్స్ బారిన పడిన వారు ధైర్యం, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా సక్రమంగా మందులు వాడుతూ పౌష్టికాహారాన్ని తీసుకుంటూ ఉంటే ఎయిడ్స్‌ని జయించవచ్చు అని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయనగరం ఆధ్వర్యంలో కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసిరాజు ఆర్థిక సహకారంతో హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారాన్ని అందించే కార్యక్రమం నిర్వహించారు. డిఆర్‌పి అప్పల నాయుడు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జెసి రాజు మాట్లాడుతూ అవగాహనతో క్రమబద్ధమైన జీవనశైలి మంచి ఆహారం మందులు తీసుకుంటూ ఉంటే ఎయిడ్స్ గురించి భయపడవలసిన అవసరం లేదన్నారు. ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం ఎయిడ్స్ బాధిత పిల్లలకు విద్యకు అవసరమైన సహకారం కారుణ్య సంస్థ అందిస్తుందన్నారు. 20 వేల రూపాయలతో 40 మంది ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారాన్ని జెసి రాజు అందించారు. అనంతరం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఎప్పటి కప్పుడు సూచనలు సలహాలు ఇస్తు వారి పట్ల శ్రద్ధ చూపుతున్న మహిళా లింక్ వర్కర్స్‌కు కారుణ్య సంస్థ ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బి ప్రసాద్, లింక్ వర్కర్స్, హరి, గోవిందా, జి.విజయ, పి. సత్యవతి, సిహెచ్ నిర్మల, విజయ పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని అందిస్తున్న జెసి రాజు

బకాయిలు వెంటనే చెల్లించాలి

స్థానిక సంస్థల్లో కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, స్థానిక సంస్థలలో కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక పెన్షనర్ల భవనంలో ఎపిటిఎఫ్ ఉత్తరాంధ్ర కార్యవర్గ సభ్యులు సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కరోనా సమయం నుండి ఇప్పటివరకు చనిపోయిన ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్య నియామాకాలను చేపట్టనందున వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయన్నారు . వెంటనే కలెక్టరు పూల్ లో ఉంచి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 2003 డిఎస్‌సి వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, మున్సిపల్ యాజమాన్యానికి ప్రత్యేక మైన సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేసి ప్రమోషన్లు కల్పించాలని, జీవో 117కు ప్రత్యామ్నాయం విధానం అమలులో పాఠశాలలు విధ్వంసం జరగకూడదని అన్నారు.

12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, వెంటనే 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, పెండింగ్ డిఎలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, డి.ఈశ్వరరావు రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎ.సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవానికి కదలిరండి

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14న పిఠాపురంలోని చిత్రాడ వద్ద జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకను విజయవంతం చేయాలని విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి అధ్యక్షతన ఆదివారం విజయనగరం జిల్లా కేంద్రంలోని ఐఎంఎ హాలులో జనసేన ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకకు విజయనగరం పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. జనసేన నాయకులు అవనాపు విక్రమ్ మాట్లాడుతూ విజయనగరం పార్లమెంట్ నుండి అత్యధికంగా అవిర్భావ సభకు హాజరై జిల్లా సత్తాను చాటుదామని అన్నారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ను విడుదల చేశారు. సమావేశంలో జనసేన నాయకులు, పిఒసిలు సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ పరిధి లోని ఏడు నియోజకవర్గాల పిఒసిలు, మండల నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తా

భోగాపురం: ఇళ్ల స్థలాల సమస్యను త్వరితిగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. భోగాపురంలోని ఎస్‌సి, బిసి కాలనీలో సుమారు 45 మంది ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరిని ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాల సమస్యను అధికారులతో మాట్లాడతానని అన్నారు. రహదారులు, శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు, పడాల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, పళ్ళ రాంబాబు, కర్రోతు శ్రీనివాసరావు, న్యాయవాది సుధాకర్, మాత నవీన్ పాల్గొన్నారు.

ఆవిర్భావ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, తదితరులు

వైభవంగా బండి మహంకాళమ్మ జాతర

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పెద మేడపల్లిలో శ్రీబండి మహంకాళమ్మ జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో ఆ గ్రామంతో పాటు ఇతర గ్రామాలకు చెందిన వేలాది మంది పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు ఆలయ సంరక్షకులు బొడ్డు బుచ్చయ్య మాట్లాడుతూ భక్తుల కోర్కెలను తీర్చడంలో ప్రధాన దేవతగా బండి మహంకాలమ్మను కొలుస్తారని చెప్పారు. ప్రతి ఆది, బుధవారం ఎక్కువ మంది మొక్కులు తీర్చుకుంటారన్నారు. ఈ జాతరలో ఎంపిటిసి రెడ్డి ఎర్నాయుడు, పూడి ధనుంజయ్ రావు, కిలాడి సన్యాసిరావు, రెడ్డి సింహాచలం మాస్టారు, వజ్రపు బంగార్రాజు, కొవ్వాడ సన్యాసిరావు (సన్నీ), కుమరాపు ధర్మ, గ్రామ పెద్దలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: చెట్టు వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న యాత్రికలు

రాజాం: రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవారి యాత్ర మహోత్సవ వేడుకల్లో భాగంగా అమ్మవారిని తొలి రోజు ఆదివారం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ దర్శించుకున్నారు. ఈ మేరకు మూడు రోజులు జరుగు యాత్ర మహోత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డోలపేటలోని టిడిపి కార్యాలయంలో వారిద్దరూ కలిసి రూ. 6లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఏడుగురు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలిపల్లి అమ్మవారి జాతర

భోగాపురం: మండలంలోని భోగాపురం, పోలిపల్లి గ్రామాలలో అమ్మవారి జాతరలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం నుంచి మూడు రోజులపాటు ఈ పండగలు జరుగనున్నాయి. ఏడాదికి ఒకసారి ఈ పండగలను నిర్వహిస్తుంటారు. పోలిపల్లి గ్రామంలోని పైడితల్లి అమ్మవారి జాతరను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటారు. ఆదివారం రాత్రి అమ్మవారి ఆలయ సమీపంలో ఉయ్యాల కంబాలు ఎత్తే కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం తోలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. మంగళవారం పాలదార మహోత్సవాన్ని అత్యంత వైభవంగా చేయనున్నారు. చిత్ర విచిత్రమైన వేషాలతో, సాముగరడీలతో, పులి వేషాలతో పాలధార ఉత్సవముతోపాటు అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇఒ వై శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ మండల పైడిరాజు తెలిపారు. భోగాపురంలో కనకదుర్గమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఈ పండగను ఏటా నిర్వహిస్తుంటారు. ఈ పండగకు చుట్టుపక్క గ్రామాలతో పాటు విశాఖపట్నం, విజయవాడ నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి దర్శించుకుంటారు.

పోలిపల్లి తల్లి



రాజాం: చెక్కును అందిస్తున్న ఎమ్‌పి కలిశెట్టి, ఎమ్మెల్యే మురళీమోహన్

150 మందితో భారీ బందోబస్తు

పోలిపల్లి, భోగాపురం అమ్మవార్ల జాతర సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ ఎన్‌వి ప్రభాకర్ తెలిపారు. 150 మంది సిబ్బందితోపాటు ఎనిమిది మంది ఎస్‌ఐలు, ఇద్దరు సిఐలు, ఒక ఎస్‌పిఎఫ్ పార్టీతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జాతరలో దొంగతనాలు జరగకుండా క్రైమ్ పార్టీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆకతాయిలను అరికట్టేందుకు ఒక మఫ్టీ టీమ్‌ను కూడా ఏర్పాటు చేశామని అన్నారు. పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రజలు, నాయకులు, అందరూ సహకరించాలని ఆయన కోరారు.